క్లుప్తంగా

ఉమెన్ సేఫ్టీ యాప్ సేవలను వినియోగించుకోవాలి

జిల్లా ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: మహిళలు, చిన్నారుల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉమెన్ సేఫ్టీ యాప్‌ను మహిళలు డౌన్లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వ్యాపార సముదాయాలు, మహిళా వసతి గృహాలు, ఫ్యాక్టరీల వద్ద మహిళలకు ఉమెన్ సేఫ్టీ యాప్ ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు, మహిళలు ప్రతి ఒక్కరూ ఈ ఉమెన్ సేఫ్టీ యాప్‌ను వారి ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేసుకుని వాటి సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు, రాత్రి సమయంలో, ప్రమాదంలో ఉన్న సమయాల్లో ఫోన్‌లో ఉమెన్ సేఫ్టీ ఎస్‌ఓఎస్ బటన్‌ను నొక్కి తక్షణ సహాయం పొందవచ్చని ఆయన తెలిపారు.

ఉల్లాసంగా బాలుర సబ్‌జోన్ పోటీలు



తలగడదీవి(నాగాయలంక): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో కృష్ణాజిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ సబ్‌జోన్ బాలుర అండర్–17 ఆటల పోటీలు హుషారుగా కొనసాగుతున్నాయి. శనివారంతో ముగిసే అండర్–17 సీనియర్ విభాగం కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, త్రోబాల్, సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో మొత్తం 85 జట్లు పాల్గొన్నాయి. శుక్రవారం జరిగిన చెస్ ఫైనల్ పోటీల్లో 11 జట్లు పాల్గొన్నాయి. ఎస్.సాయివర్మప్రసాద్ (జెడ్పీహెచ్‌ఎస్ అవనిగడ్డ), బి.సాయిఅఖిల్ (జెడ్పీహెచ్‌ఎస్, అవనిగడ్డ), ఎ.ధీరజ్ లక్ష్మీనారాయణ (విజ్ఞాన్ విహార్ అవనిగడ్డ) వరుస మూడు స్థానాల్లో విజయం సాధించారు.

భవిత కేంద్రం తనిఖీ

గూడూరు: గూడూరులోని భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్షా అభియాన్ కృష్ణాజిల్లా ఏపీసీ ఎం.ఫణిధూర్జటి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో నేరుగా ముచ్చటించారు. పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు ఇచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందిన ఆయన వారిని అభినందించారు. భవిత కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, సీఎంఓ టి.రమేష్; ఐఈ కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, ఐఆర్పీ పి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయునికి వెండి వస్తువులు సమర్పణ

మోపిదేవి: మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి హైదరాబాద్ వాస్తవ్యుడు రెడ్రౌతు మురళీకృష్ణ శుక్రవారం సుమారు రూ.1.08 లక్షల విలువగల ఒక కేజీ 2 గ్రాముల బరువు గల వెండి వస్తువులు సమర్పించారు. స్వామివారిని దర్శించుకున్న ఆయన వెండి గ్లాస్, రెండు వెండి ప్లేట్లు, రెండు వెండి పాదుకలు స్వామివారికి కానుకగా ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామవర ప్రసాదరావుకు అందజేశారు.

నిబంధనలకు అనుగుణంగా అనుమతులు తీసుకోవాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఎంయూడీఏ పరిధిలో లేఅవుట్లకు నిబంధనలకు అనుగుణంగా తగిన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎంయూడీఏ చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. ఎంయూడీఏకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి ఆయన శుక్రవారం అధికారులతో కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక జాయింట్ సెక్రటరీ జె.శివయ్య, రీజనల్ జాయింట్ డైరెక్టర్ టౌన్ ప్లానింగ్(రాజమండ్రి) బి.శ్రీనివాసమూర్తి, జిల్లా పరిశ్రమల అధికారి ఆర్.వెంకట్రావు, ఎంయూడీఏ డెప్యూటీ కలెక్టర్ రవిశంకర్, ఆర్ అండ్ బీ డీఈ సంగీత, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ నిరసన

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపోలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ డిపో కార్యదర్శి ఎస్.మహేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లు ఇలా.. మురుగు పారేదెలా..?

- గుర్రపుడెక్కతో పూడిపోయిన డ్రెయిన్‌లు
- మురుగు పారక ప్రజల ఇక్కట్లు

మచిలీపట్నంటౌన్: నియోజకవర్గంలోని పలు డ్రెయిన్‌లు వ్యర్థాలతో పూడిపోయాయి. ముఖ్యంగా పంట పొలాల దిగువనున్న మేజర్, మైనర్ డ్రెయిన్‌లతో పాటు నగరంలో ఉన్న పలు డ్రెయిన్‌లు గుర్రపు డెక్క, తూడు కాడ పేరుకుపోయి పచ్చగా దర్శనమిస్తున్నాయి. నగరంలోని మురుగునీటి పారుదలకు శివారున ఉన్న డ్రెయిన్‌లతో పాటు పంట పొలాలలోని మురుగునీరు పారుదలకు ఉన్న డ్రెయిన్‌లో గుర్రపు డెక్కతో నిండిపోయాయి. దీంతో మురుగునీటి పారుదల మందగించి రానున్న రోజుల్లో ముంపు ప్రమాదం పొంచి ఉంది. ఈ డ్రెయిన్‌లలో పెద్ద ఎత్తున పెరిగిన గుర్రపు డెక్క, తూడుకాడలను ఈ వేసవిలోనే పూర్తి స్థాయిలో తొలగించకుంటే అటు రైతులకు, ఇటు నగర వాసులకు ఇబ్బందులు తప్పవు.

పూడిపోతున్న డ్రెయిన్‌లు ఇవే...

నియోజకవర్గంలోని పంట పొలాల వెంబడి ఉన్న మేజర్, మైనర్ డ్రెయిన్‌లతో పాటు పంట కాలువల్లో సైతం గుర్రపుడెక్క, తూడు కాడ పెద్ద ఎత్తున పేరుకుపోయి దర్శనమిస్తోంది. ఈ దృశ్యం చూస్తున్న రైతుల గుండెల్లో ఇప్పటి నుంచే ముంపు భయం పట్టుకుంటోంది. మండల పరిధిలోని శివగంగ, గుండేరు, ఐనంపూడి, కానూరు, పెదపట్నం ప్రాంతాల్లో ఉన్న ప్రధాన డ్రెయిన్‌లు గుర్రపుడెక్క, తూడు కాడలతో పేరుకుపోయాయి. వీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు రెవెన్యూ అధికారులు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టకుంటే ఖరీఫ్ సాగు సమయంలో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక నగరంలో ఈడేపల్లి, సబ్‌జైల్, ఫతుల్లాబాద్ వంటి ప్రధాన మురుగు



శివగంగ ప్రధాన డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క, తూడు కాడ



రాడార్ కేంద్రం వద్ద డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క, తూడు కాడ

నీటి పారుదల డ్రెయిన్‌లు ఉన్నాయి. ఈ డ్రెయిన్‌లు కూడా పెద్ద ఎత్తున వ్యర్థాలతో నిండి పోయియి. ఈ డ్రెయిన్‌లలో ప్రస్తుతం మురుగునీటి పారుదల పూర్తిస్థాయిలో జరక్కపోవటంతో నగరంలోని పలు ప్రాంతాల్లోని కచ్చా డ్రెయిన్‌లు పొంగుతూ మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తున్నాయి. ఈ ప్రధాన డ్రెయిన్‌ల శివారు ప్రాంతాల్లో గుర్రపుడెక్క, తూడుకాడ దట్టంగా పెరగటంతో మురుగునీటి పారుదలకు ఇబ్బంది కలుగుతోంది. ముఖ్యంగా నగర నడిబొడ్డున ఉన్న కోనేరుసెంటర్‌లో డ్రెయిన్ పూర్తి స్థాయిలో పారకపోవటంతో రాకపోకలు సాగించే వారు ఆ ప్రాంతంలో వస్తున్న దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. కోటతుళ్లి వారి సెంటర్ నుంచి కోనేరు సెంటర్ వైపు మార్గం ప్రారంభంలో వర్షాకాలంలో నీటి ముంపు మాదిరిగా డ్రెయిన్‌లలోని మురుగునీరు ప్రవహిస్తోంది. కెనడీ రోడ్డులో బచ్చుపేట ఆంజనేయ స్వామి గుడి సమీపాన, గొడుగుపేట, ఈడేపల్లిలోని పలు ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్‌లలోని మురుగునీరు రోడ్లపై తరచూ ప్రవహిస్తూనే ఉంటుంది. ఇప్పటికైనా ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి డ్రెయిన్‌లలోని వ్యర్థాల తొలగింపునకు ఈ వేసవిలో చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

పెదన: జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎంపీయూపీ ఉర్దూ స్కూలులో బాలికలకు, మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించి వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన చట్టాలు, హక్కుల గురించి ఎంఈవో–2 హరనాథ్ తెలిపారు. అనంతరం బాలికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏఆర్ అస్లాం హిదయతున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరులో...

మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీల ఆధ్వర్యంలో చెన్నూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

భయం వద్దు... భవిష్యత్తే ముద్దు

కృత్తివెన్ను: ఆడపిల్లలు భయం వీడి తమ ఉజ్వలమైన భవిష్యత్తు కోసం అలుపెరగకుండా శ్రమించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామలగౌరి అన్నారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నీలిపూడి, సంగమూడి, పల్లెపాలెం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెతో పాటు హెచ్‌ఎంలు ఏవీఎస్ బాబు, పద్మజారాణి, సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత ఎక్కువగా సెల్‌ఫోన్‌కు ఆకర్షితులవుతూ తమ జీవితాలను పణంగా పెడుతున్నారన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

పైపై మెరుగులకు లోను కాకుండా చదువే పరమావధిగా భావించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులతో ర్యాలీలు, మానవహారం, చేయించారు. నీలిపూడిలో సర్పంచ్ పాశం కృష్ణ విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాఘవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): ఆడపిల్లలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాండురంగ హైస్కూల్‌లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. తొలుత బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ, సీడీపీవో గ్లోరీ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య, న్యాయవాది అజమ్ తున్నీసా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు స్వశక్తితో ఎదగాలి

కోనేరుసెంటర్: యుక్త వయసులో ఉన్న బాలికలు ఆపద సమయంలో ఎవరి సహాయం కోసమో ఎదురుచూడకుండా స్వశక్తితో ఎదుర్కోవాలని అని, ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఎస్.ఉష మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనుకాకుండా జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలన్నారు. ఫార్మసీ కళాశాల విభాగాధిపతి ఆచార్య మారుతి తదితరులు మాట్లాడారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం.శ్రావణి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.

సమాజంలో లింగ వివక్ష రూపుమాపాలి

గోగినేనిపాలెం(ఘంటసాల): నేటి సమాజంలో లింగ వివక్ష రూపుమాపాల్సిన అవసరం ఎంతైన ఉందని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అన్నారు. ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

సంక్షిప్తంగా...

- **నేడు నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం**

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎ.గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నగరంలోని ఈడేపల్లి, నారాయణపురం, పంచాయతీరాజ్ కాలనీ, టెంపుల్ కాలనీ, మేదరకాలనీ, సర్కిల్‌పేట, జవ్వారుపేట, ఖొజ్జిల్లిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

- **సారా తయారీ స్థావరాలపై దాడులు**

పెడన: నాటు సారా తయారీ స్థావరాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ నేతృత్వంలో సిబ్బంది పెడన మండలం నందమూరు, గూడూరు మండలం గండ్రం గ్రామాల్లో శుక్రవారం విస్తృత దాడులు నిర్వహించారు. నందమూరులో 300 లీటర్లు, గండ్రంలో 200 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

- **31న కన్యకాంబ ఆత్మార్పణ మహోత్సవం**

నాగాయలంక: శ్రీఆర్యవైశ్యసంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి అలయంలో ఈనెల 31న కన్యకాంబ అమ్మవారి 4642వ ఆత్మార్పణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సంఘం అధ్యక్షుడు చిట్టా సాంబశివరావు శుక్రవారం తెలిపారు. దివిసీమ వ్యాప్తంగా భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

- **కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ సంఘ రక్తదానం**

మచిలీపట్నంటౌన్: ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ సంఘం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఆ సంఘ అధ్యక్షుడు జగన్నాథ్ షిండే 75వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ సంఘ నాయకులు శుక్రవారం రక్తదానం చేశారు. పట్టాభి రెడ్‌క్రాస్ సంస్థ బ్లడ్ బ్యాంక్‌లో ఆ సంఘ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు ఉదయగిరి సురేష్‌తో పాటు పలువురు నాయకులు రక్తదానం చేశారు. సంఘ ప్రతినిధులు పోలిశెట్టి ప్రసాద్, బృందావనం నారాయణభట్ రక్తదానం చేశారు. వీరి నుంచి రెడ్‌క్రాస్ సంస్థ వైద్యుడు హనుమంతయ్య, సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తోట శ్రీనివాస్, మాదిరెడ్డి అంజిబాబు, కె.అశోక్ కుమార్, రెడ్డి, విజయ్ సాయి కుమార్, తమ్మన రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

- **నేడు జాతీయ ఓటరు దినోత్సవం**

పెడన: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పట్టణంలోని స్థానిక భట్ట జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ఏర్పాటు చేశామని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం హైస్కూలు నుంచి ర్యాలీ ఉంటుందని, అనంతరం తిరిగి పాఠశాలకు చేరుకుని సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించడం జరుగుతుందన్నారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరు కూడా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పట్టణంలోని బీఎల్‌వోలు అంతా ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా ఆయన ఆదేశించారు.

- **ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గుప్తాకు సన్మానం**

చల్లపల్లి(అవనిగడ్డ): ఆర్యవైశ్య సంఘం కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విస్సంశెట్టి మోగిలేశ్వర గుప్తాను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ హరిరాజేంద్రప్రసాద్, చల్లపల్లి ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం దుశ్శాలువా కప్పి సన్మానించారు.

- **మినుములో ఆకుముడత పురుగు**

శివరామపురం(మోపిదేవి): మినుము సాగులో ఆకుముడత పురుగు వ్యాపిస్తున్నట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి కె.హెప్సిబారాణి తెలిపారు. మండల పరిధిలోని శివరామపురంలో రైతు పి.తాండవ కృష్ణ పొలంలో మినుము పంటను శుక్రవారం ఆమె పరిశీలించారు.

- **సాయుధ దళాల పతాక నిధి సేకరణలో జిల్లా మూడోస్థానం**

చిలకలపూడి(మచిలీపట్నం): సాయుధ దళాల పతాక నిధి సేకరణలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచినట్లు జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి సర్జన్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ కె.కళ్యాణవీణ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించి డిసెంబరులో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా మెమెంటో తీసుకోవాల్సి ఉండగా ఆ కార్యక్రమం అనివార్య కారణాల వల్ల రద్దయింది. ఆ మెమొంటోను శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. అనంతరం సైనిక్ వెల్ఫేర్ –2025 క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

- **రోడ్డు ప్రమాదంలో ఎస్‌టీవోకి గాయాలు**

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అవనిగడ్డ ఎస్‌టీవో పుప్పాల ఆదిశేషు గాయాలపాలయ్యారు. రేపల్లె నుంచి డ్యూటీకి వస్తుండగా టోల్‌ప్లాజా – పులిగడ్డ పెనుమూడి వారధికి మధ్య ఎదురుగా వస్తున్న లారీ బైక్ హ్యాండిల్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన ఆదిశేషుకు గాయాలయ్యాయి. వెంటనే రేపల్లెలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు.

- **అగ్నిప్రమాద బాధితులకు సాయం**

పర్రచివర(నాగాయలంక): మండల పరిధిలోని పర్రచివర శివారు బిల్లీగ్రాహం నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గుర్రం స్వామేరు కుటుంబాన్ని శుక్రవారం మండల శ్రీకృష్ణదేవరాయ శ్రీకనకదుర్గమ్మ కాపు సంక్షేమ సంఘం నాయకులు పరామర్శించారు. బాధితులకు రూ.4 వేలు సాయం అందించారు. సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) ఆర్థిక సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, అంబటి లక్ష్మణప్రసాద్(పాలెం చిన్నా), కమతం నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

- **ధర్మసత్రం స్థలాన్ని స్వాధీనం చేసుకున్న దేవదాయశాఖ**

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో ఉన్న తమ్మన పిచ్చియ్య ధర్మసత్ర స్థలాన్ని శుక్రవారం దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు, మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం డెప్యూటీ కమిషనర్ డి.శ్రీరామవరప్రసాదరావు, ఈఓ గోవాడ కృష్ణారావు, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నారు. 110 సంవత్సరాల క్రితం అపర కర్మలకు ఈ స్థలంలో ఉండే సత్రాన్ని వినియోగించేవారు. ఈ సత్రం స్థలం అన్యాక్రాంతం అవుతున్నందున స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. భవిష్యత్తులో ఈ స్థలంలో సత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. విజయవాడ ప్రధాన రహదారి పక్కన 616 చదరపు గజాల మేర ఈ స్థలం ఉందని, అత్యంత విలువైన ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఈఓలు సమ్మెట ఆంజనేయస్వామి, తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, ఆకుల కొండలరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ప్రసాద్, వై.శిరీష, కగ్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- **ఆర్టీసీ కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లిలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి ఎ.వాణిశ్రీ కోరారు. చల్లపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్గో కార్యాలయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు.

- **విజయదుర్గా పీఠాధిపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్**

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వెదురుపాకలో శ్రీవిజయదుర్గా పీఠాధిపతి శ్రీగాడ్ గురుదేవ్‌ని కలుసుకుని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బుద్ధప్రసాద్‌కు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

- **క్రీడా దుస్తులు పంపిణీ**

గోగినేనిపాలెం(ఘంటసాల): మండలంలోని గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్లో క్రీడా కారులకు శ్రీకాకుళం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అత్తలూరి గోపీచంద్ కుమారుడు అత్తలూరి సుధీర్ కుమార్ రూ.20 వేల విలువైన క్రీడా దుస్తులను వితరణగా ఇచ్చారు. వాటిని శుక్రవారం హెచ్‌ఎం వేణుగోపాలరావు విద్యార్థులకు అందించారు.

పారిశుద్ధ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు

కలెక్టర్ బాలాజీ హెచ్చరిక

మచిలీపట్నంటౌన్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను, పారిశుద్ధ్య సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టర్ శుక్రవారం నగరంలోని 45, 46 డివిజన్లలో పర్యటించి ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్త వేరు చేయించి సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈడేపల్లి చిన్న శక్తి గుడి రోడ్డులో రోడ్డు వెంబడి చెత్త పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని శానిటేషన్ సిబ్బందిని హెచ్చరించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి శానిటేషన్ సిబ్బందికి అందించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా ఎక్కువగా చెత్త వేస్తున్న గార్బేజ్ స్పాట్స్ గుర్తించాలని అన్నారు. నగరంలో డోర్ టు డోర్ చెత్త సేకరణ నూరు శాతం జరగాలని కమిషనర్ బాపిరాజును ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని, ఇందులో భాగంగా స్వచ్ఛ మచిలీపట్నం, సుందర మచిలీపట్నం సాధనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ బాపిరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్, వార్డు ఇన్‌చార్జ్ పీవీ ఫణి కుమార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అర్జీదారులకు భరోసా కల్పించిన కలెక్టర్

కోడూరు: కోడూరు మండలంలో శుక్రవారం పర్యటించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి పలువురు తమ సమస్యలను విన్నవించారు. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన మద్దాల శ్యామల, మాచర్ల సంపూర్ణమ్మ తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. అర్హతను పరిశీలించి నివేదికను సమర్పించాలని తహసీల్దార్ శ్రీనునాయక్‌ను కలెక్టర్ ఆదేశించారు. అదే గ్రామానికి చెందిన కానపు రెడ్డి శివనాగరాజు తన ఇంటి స్థలం, డొంక స్థలానికి



తడి పొడి చెత్త సేకరణపై కార్మికుడితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో కమిషనర్

సంబంధించిన సరిహద్దు విషయంలో న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. స్వతంత్రపురం గ్రామానికి చెందిన పులిగడ్డ నాగమణి తన సోదరుడు దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడని, బాధితుడికి పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే మచిలీపట్నంలోని వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు.

కోడూరు పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు

కోడూరు: కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆకస్మిక తనిఖీలు జరిపారు. పీహెచ్‌సీలో రోజువారి ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) కార్డు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో డెలివరీలు, ల్యాబ్‌లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలపై ఆరా తీశారు. రక్తహీనత (ఎనీమియా) బాధితులకు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో టీబీ వ్యాధితో బాధపడుతున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సమీపంలో ఉన్న ఓ బీపీ బాధితుడి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్ సీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి శిరీష, సర్పంచి వెన్నా షైనీ, ఎంపీడీఓ సుధాప్రవీణ్, తహసీల్దార్ శ్రీనునాయక్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఆక్రమణల తొలగింపు

పెడన: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ఈ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాదారులు తమకు వ్యాపారాలు సక్రమంగా నడవడం లేదని, ఆక్రమించుకుని సబ్ లీజుల ద్వారా కొన్ని దుకాణాలు ఏర్పాటు చేసుకుని నడుపుతున్నారని జిల్లా లీగల్ సెల్ అథారిటీకి ఫిర్యాదు చేయడంతో లీగల్‌సెల్ జడ్జి ఆదేశాలతో మున్సిపల్ అధికారులు కాంప్లెక్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిని తొలగించామన్నారు. భవిష్యత్తులో మళ్లీ పెట్టాలని చూస్తే మాత్రం మున్సిపల్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పక్క



నిబంధనలకు విరుద్ధంగా ఉన్న దుకాణాలను తొలగిస్తున్న కమిషనర్, టీపీవో సుజనాకుమారి

దుకాణదారులకు ఇబ్బంది కలుగకుండా మిగిలిన మున్సిపల్ కాంప్లెక్స్‌లలోని దుకాణాదారులు నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో సుజనాకుమారి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పామర్తి జితేంద్ర, బండి కిరణ్, ప్లానింగ్ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలోని అన్ని రుగ్మతలకు బౌద్ధం దివ్యౌషధం

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

ఘంటసాల: సమాజంలోని అన్ని రుగ్మతలకు బౌద్ధమే దివ్యౌషధమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల గ్రామంలోని ప్రాచీన బౌద్ధ స్థూపం వద్ద భంతే ధమ్మ ధజ థెరో ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థినీ, విద్యార్థులతో సత్ప్రవర్తన – ధ్యాన సాధన చేయించడంతో పాటు సద్ధమ్మ ఉపోసత క్యాలెండర్‌ను ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు, బుద్ధ – అంబేడ్కర్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, సంబుద్ధ వచనం కరపత్రాన్ని మానవ హక్కుల, సైబర్ సెక్యూరిటీ అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.విశ్వనాథ్ చేతుల మీదగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బుద్ధుని గుర్రం అయిన కంతక పేరుతో ఏర్పడిన గ్రామం కంతకశైల అని కాలక్రమంలో ఘంటసాలగా మారిందని చెప్పారు. చారిత్రక వారసత్వ గ్రామంగా ఘంటసాలకు గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. ఘంటసాల గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు గతంలో శయనబుద్ధ ప్రాజెక్టు మంజూరు చేయగా ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ప్రభుత్వానికి



ఘంటసాల బౌద్ధ స్థూపం వద్ద సద్ధమ్మ ఉపోసత క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఉచితంగా ఇచ్చారని, ఆగిపోయిన ప్రాజెక్టు మళ్లీ కూటమి ప్రభుత్వంలో ప్రారంభించి పూర్తి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. వచ్చే మే నెలలో బుద్ధ జయంతి వేడుకలు ఘంటసాల గ్రామంలో ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, మానవ హక్కుల, సైబర్ సెక్యూరిటీ అసోసియేషన్ డైరెక్టర్ డాక్టర్ పి.విశ్వనాథ్, డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, గొర్రెపాటి చంటి బాబు, కొండపల్లి రామకృష్ణ, జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ ఇతర బ్యాంకులకు ఆదర్శం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఇతర బ్యాంకులకు ఆదర్శనీయంగా ఉందని తెలంగాణలోని హైదరాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో భాస్కర్ సుబ్రహ్మణ్యం అన్నారు. కేడీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలపై అధ్యయనం చేసేందుకు ఆయనతో పాటు బ్యాంకు అధికారులు శుక్రవారం కేడీసీసీ బ్యాంకును సందర్శించారు. వీరికి కేడీసీసీబీ సీఈవో ఎ.శ్యామ్‌మనోహర్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవల వివరాలను తెలియజేశారు. అనంతరం భాస్కర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ త్వరలో ఇదే విధానాన్ని తమ బ్యాంకులో ప్రవేశపెడతామని తెలిపారు. అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన సీఈవో శ్యామ్‌మనోహర్, బ్యాంకు అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.